
తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 152
పేజీలు : 4
వెల : 4
మల్కాజిగిరి
మంగళవారం, 26-12-2023

జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్ లో నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలను కుంటున్నారా?
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com,
www.jayabheridaily.com
Call me: 9391 544 889
JB TV జయభేరి

## అష్టభుజి ఆకారంలో
# గర్భ గుడి



- ఎట్టి విపత్తు వచ్చినా 2,500 ఏండ్లు తట్టుకొని నిలబడేలా రామాలయ నిర్మాణం
- దేశ సంస్కృతి ప్రతిబింబించే శైలి
- ఆర్కిటెక్ట్ అశీశ్ సోంపురా వెల్లడి

**జయభేరి, అయోధ్య, డిసెంబర్ 25**

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రామ మందిర ప్రారంభోత్సవానికి అయోధ్య సిద్ధమవుతున్నది. వచ్చే ఏడాది జనవరి 22న ఆలయంలో రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరగనున్నది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమవుతున్న ఈ ఆలయానికి ఎన్నో విశిష్టతలు, ప్రత్యేకతలు ఉన్నాయి. ఏ విధమైన విపత్తు వచ్చినా ఆలయం చెక్కు చెదరదట. ఎంత పెద్ద ప్రకృతి విపత్తు వచ్చినా 2,500 ఏండ్లు తట్టుకొని నిలబడేలా ఆలయాన్ని డిజైన్ చేసినట్టు ఆర్కిటెక్ట్ అశీశ్ సోంపురా తాజాగా తెలిపారు. ఆలయాన్ని దేశ సంస్కృతిని ప్రతిబింబించేలా నాగర శైలిలో నిర్మిస్తున్నారు. ఇక ముఖ్యమైన ఆలయ గర్భ గుడిని అష్టభుజి ఆకారంలో తీర్చిదిద్దుతున్నామని, గర్భ గుడి అష్టభుజి ఆకారంలో ఉన్న దేవాలయాలు తక్కువని సోంపురా వివరించారు. ఆలయ శిఖరం కూడా అష్టభుజి ఆకారంలో ఉంటుందని తెలిపారు. భక్తులకు సదుపాయాలపై మాట్లాడుతూ ప్రధాన ఆలయ సముదాయం వరకు వెళ్లే కారిడార్లో 3540 వేల మంది వెళ్లే అవకాశం ఉందని, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆలయ కాంప్లెక్స్ లోపల తక్కువ భవనాలు ఉంటాయని, మ్యూజియం, రిసెర్చ్ సెంటర్, ప్రార్థన మందిరం వంటి ఇతర సౌకర్యాలను బయట ఏర్పాటు చేయాలని అనుకొంటున్నామని చెప్పారు. రామ మందిర ప్రారంభోత్సవానికి గుర్తుగా నేపాల్ పలు ప్రత్యేక కానుకలను పంపనున్నదని స్థానిక మీడియా పేర్కొన్నది. ఇందులో వివిధ రకాల నగలు, సామగ్రి, బట్టలు, మిఠాయిలు ఉంటాయని మై రిపబ్లికా వార్తాపత్రిక తెలిపింది. వీటిని అందజేయడం కోసం జనక్పూర్ధామ్ అయోధ్యధామ్ ప్రయాణం జనవరి 18న ప్రారంభమవుతుందని, 20 నాటికి అయోధ్య చేరుకుంటుందని జానకి ఆలయ మహంత రామ్రోషణ్ దాస్ వైష్ణవ్ తెలిపారు. అదే రోజున కానుకలను రామ మందిర ట్రస్టుకు అందజేస్తామని పేర్కొన్నారు. గతంలో అయోధ్య ఆలయంలో ప్రతిష్ఠించే రాముడి విగ్రహాన్ని తయారు చేసేందుకు నేపాల్ కాళిగండకి నదీ తీరంలో సేకరించిన శాలిగ్రామ రాళ్లను అయోధ్యకు పంపిందని పత్రిక తెలిపింది. ఆలయం ప్రారంభోత్సవం నేపథ్యంలో బీజేపీ ఎంపీ సుబ్రతా పాఠక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రామ భక్తులపై కాల్పులు జరిపించిన సమాజ్వాదీ పార్టీ నేతలకు ఆహ్వానాలు పంపొద్దని రామ మందిర్ ట్రస్టుకు లేఖ రాశారు.


2 లో

## రూ.500 గ్యాస్ కు
# అంతా రెడీ




తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో రూ.500లకే గ్యాస్ సిలిండర్ ప్రధానమైనది. 'మహాలక్ష్మి పథకంలో భాగమైన సబ్సిడీ సిలిండర్ పంపిణీపై ఇప్పటికే పౌర సరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. తాజాగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ పంపిణీకి సంబంధించి లబ్ధిదారుల ఎంపికపై ఆ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించినట్లు తెలుస్తోంది. దీని ప్రకారం రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న వారికే ఈ పథకం వర్తింపచేసే అవకాశాలున్నట్లు సమాచారం. లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకోవడం ద్వారా సిలిండర్లు దుర్వినియోగం కాకుండా ఉంటాయని ప్రతిపాదించినట్లు తెలిసింది. వంద రోజుల్లో 6 గ్యారెంటీలను అమలు చేస్తామన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ పథకానికి రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకోవాలని భావిస్తోంది.

## పెరుగుతున్న కరోనా కేసులు
# చిన్నపిల్లలే టార్గెట్.!



**జయభేరి, హైదరాబాద్ :**

**కరోనా మహమ్మారి మళ్లీ తన ప్రతాపాన్ని చూపుతోంది. కరోనా తగ్గినట్టే తగ్గి కొత్త రూపం సంతరించుకొని ప్రపంచవ్యాప్తంగా మళ్లీ ఆందోళన కలిగిస్తోంది. ఇటు భారత్లోనూ కరోనా కలకలం రేపుతోంది. పలు రాష్ట్రాల్లో కొవిడ్ కొత్త వేరియంట్ కేసులు నమోదవుతున్నాయి. తాజా వేరియంట్ చిన్న పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ హెచ్చరించింది. తెలంగాణలో రోజురోజుకూ కేసుల సంఖ్య పెరుగుతోంది. హైదరాబాద్ లో ఇద్దరు పిల్లలు కరోనా బారిన పడ్డారు. నగరంలోని నీలోఫర్ ఆసుపత్రిలో వీరికి పరీక్షలు నిర్వహించగా కొవిడ్ నిర్ధారణ అయింది. తెలంగాణ వ్యాప్తంగా కొత్తగా మరో 6 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 25 యాక్టివ్ కేసులు ఉన్నట్టుగా తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా గణపురం మండలం గాంధీనగర్ కు చెందిన ఒక మహిళలో కొత్త వేరియంట్ లక్షణాలను వైద్యులు గుర్తించారు.**

వెంటనే ఆమెను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఆమె నుంచి శాంపిల్స్ సేకరించిన డాక్టర్లు.. టెస్టింగ్ కోసం పూణెలోని ల్యాబ్ కు పంపారు. ఎంజీఎం ఆసుపత్రిలో ప్రత్యేక కరోనా వార్డును ఏర్పాటు చేశారు. కరోనా వ్యాప్తితో అప్రమత్తమైన ఎంజీఎం హాస్పిటల్ సిబ్బంది మాస్క్ లేనిదే ఆస్పత్రిలోకి ఎవరినీ అనుమతించడంలేదు. సిద్ధిపేటలో కూడా ఒక కేసు నమోదయింది. కరోనా కేసుల సంఖ్య పెరుగుతుండటంతో అన్ని జిల్లాల ఆసుపత్రుల్లో కొవిడ్ కు సంబంధించిన ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని వైద్యాధికారులకు రాష్ట్ర ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో, టెస్టింగ్ సెంటర్లను పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు చెపుతున్నారు.

## దేశంలో 4 వేల మార్కు దాటిన కొవిడ్ యాక్టివ్ కేసులు

**జయభేరి, న్యూ ఢిల్లీ, డిసెంబర్ 25**

భారత్లో కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 4 వేల మార్కు దాటింది. కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు 24 గంటల వ్యవధిలో 312 కొత్త కేసులు బయటపడ్డాయి. దీంతో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 3,742 నుంచి 4,054కు పెరిగింది.ఇక తాజా కేసుల్లో అత్యధికంగా కేరళలో 128 కేసులు వెలుగుచూశాయి. నిన్న ఒక్క రోజే ఒక మరణం నమోదైంది. దీంతో మొత్తం కొవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య 5,33,33కి చేరింది. ఇక 24 గంటల్లో 315 మంది కొవిడ్ నుంచి కోలుకున్నారు. దీంతో మొత్తం కోలుకున్న వారి సంఖ్య 4.44 కోట్లకు (4,44,71,860) చేరుకుంది.మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసుల సంఖ్య 0.01 శాతం మాత్రమేనని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. అదే విధంగా రికవరీ రేటు 98.81 శాతం, మరణాలు 1.18 శాతంగా ఉన్నాయని తెలిపింది. ఇప్పటి వరకూ 220.67 కోట్ల (220,67,79,081) కరోనా వ్యాక్సిన్ డోసులు పంపిణీ చేసినట్లు వెల్లడించింది.ఇదిలా ఉండగా, మహారాష్ట్రలోని థానేలో తాజాగా 5 కరోనా కొత్త వేరియంట్ జేఎన్.1 కేసులు నమోదయ్యాయి. నవంబర్ 30 నుంచి 20 నమూనాలను పరీక్షించగా థానే నగరంలో ఐదు JN.1 వేరియంట్ కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం నగరంలో క్రియాశీల కేసుల సంఖ్య 28కి పెరిగింది. వారిలో ఇద్దరు ఆసుపత్రులలో చికిత్స పొందుతుండగా, మిగిలిన వారు వారి ఇళ్లలో కోలుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం దేశంలో కరోనా కేసులు మళ్లీ పెరగడానికి కొత్త వేరియంట్ జేఎన్.1 (JN.1) కారణమని తెలుస్తోంది.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి జ్వరం

- గత మూడు రోజుల నుంచి జ్వరం, గొంతు నొప్పితో బాధపడుతున్నసిఎం



**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 25**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జ్వరం బారిన పడ్డారు. జూబ్లీహిల్స్లోని రేవంత్ నివాసంలో ఆయనకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి జ్వరం, గొంతు నొప్పితో రేవంత్ బాధపడుతున్నట్లు సమాచారం. ఇంటి వద్దే ఫ్యామిలీ డాక్టర్ రేవంత్ను పరీక్షించి, మందులు సూచించినట్లు తెలుస్తోంది.నిన్న సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలోనూ రేవంత్ కొంత నీరసంగా కనిపించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరమే రేవంత్ స్వల్ప అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది.

# మేడారంకు పోటెత్తిన భక్తజనం



**జయభేరి, వరంగల్ :**

2024 మేడారం మహాజాతరకు ఇంకా రెండు నెలల సమయం ఉంది. ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు మహాజాతర తేదీలను ఖరారు చేశారు. కానీ భక్తజనం మాత్రం ముందే లక్షలాదిగా మేడారంకు తరలి వస్తున్నారు. మూడు రోజులు వరుసగా సెలవు దినాలు రావడంతో లక్షల సంఖ్యలో భక్తులు మేడారంకు క్యూ కట్టారు. సమ్మక్కసారక్క దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న ఆదివారం ఒక్కరోజే సుమారు రెండు లక్షల మంది భక్తులు మేడారం సమ్మక్క సారక్క దేవతలను దర్శించుకున్నారు. ఏపీ, తెలంగాణ, ఛత్తీస్గడ్, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలివచ్చి సమ్మక్కసారక్క దేవతలు దర్శించుకుంటున్నారు. సమ్మక్కసారక్క దేవతలకు ప్రీతికరమైన నిలువెత్తు బెల్లం మొక్కులు సమర్పిస్తున్నారు. రోజుకు లక్షకు పైగానే భక్తులు సమ్మక్క సారక్క దేవతలు దర్శించుకోవడం చర్చగా మారింది. జాతరకి ఇంకా రెండు నెలల సమయం ఉన్నప్పటికీ భక్తులు ఇంత పెద్ద సంఖ్యలో ముందే ఎందుకు తరలివస్తున్నారని చర్చ జరుగుతుంది. అయితే జాతర సమయం వరకు మళ్లీ కరోనా కేసులు పెరిగిపోతే రావడం ఇబ్బందికరంగా ఉంటుందని అందుకే ముందస్తుగా వచ్చి సమ్మక్క సారక్క దేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్నామని కొందరు స్థానికులు అంటున్నారు. మరికొందరు స్థానికులు మాత్రం జాతర మిగతా 2 లో

jayabheridaily.com
ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## రూ.500 గ్యాస్ కు అంతా రెడీ

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో రూ.500లకే గ్యాస్ సిలిండర్ ప్రధానమైనది. 'మహాలక్ష్మి పథకంలో భాగమైన సబ్సిడీ సిలిండర్ పంపిణీపై ఇప్పటికే పౌర సరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. తాజాగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ పంపిణీకి సంబంధించి లబ్ధిదారుల ఎంపికపై ఆ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించినట్లు తెలుస్తోంది. దీని ప్రకారం రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న వారికే ఈ పథకం వర్తింపచేసే అవకాశాలున్నట్లు సమాచారం. లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకోవడం ద్వారా సిలిండర్లు దుర్వినియోగం కాకుండా ఉంటాయని ప్రతిపాదించినట్లు తెలిసింది. వంద రోజుల్లో 6 గ్యారెంటీలను అమలు చేస్తామన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ పథకానికి రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకోవాలని భావిస్తోంది. అయితే, రేషన్ కార్డులతో సంబంధం లేకుండా అర్హులను ఎంపిక చేయాలన్న ప్రతిపాదన ఉన్నప్పటికీ అది అమలు చేయాలంటే చాలా సమయం పడుతోందని, లబ్ధిదారుల ఎంపిక కష్టం అవుతుందని యోచిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం కలెక్టర్లతో నిర్వహించే సమావేశంలో ఈ అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.రాష్ట్రవ్యాప్తంగా 1.20 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, రేషన్ కార్డుల సంఖ్య 89.98 లక్షలుగా ఉంది. 'గివ్ ఇట్ అప్'లో భాగంగా 4.2 లక్షల మంది రాయితీ వదులుకున్నారు. వీరిని మినహాయిస్తే లబ్ధిదారుల సంఖ్య 85.79 లక్షలుగా ఉంది. అయితే, రేషన్ కార్డు డేటా బేస్ తో మ్యాపింగ్ అయిన గ్యాస్ కనెక్షన్ల సంఖ్య 63.6 లక్షలుగా ఉంది. మరోవైపు, 'ఉజ్వల' గ్యాస్ కనెక్షన్లకు రూ.340 రాయితీ అందుతుండగా, మొత్తం కనెక్షన్లలో వీటి సంఖ్య 11.58 లక్షలు ఉంది. రాయితీ సిలిండర్లు ఏడాదికి ఆరు ఇవ్వాలా.? లేక పన్నెండా.? అనే దానిపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. ఇందుకోసం అర్హులైన వారి కుటుంబంలో సభ్యుల సంఖ్య, గతేడాది వారు వాడిన సిలిండర్ల సంఖ్య వంటి వాటిని పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది. కాగా, రాష్ట్రంలో ప్రతినెలా సిలిండర్ రీఫిల్ చేసుకునే వారు 44 శాతం మంది మాత్రమే ఉన్నారు. కొత్తగా రేషన్ కార్డులు పొందే వారికీ ఈ పథకాన్ని వర్తింపచేయాలని, అయితే, కొత్తగా గ్యాస్ కనెక్షన్లు తీసుకున్న వారిని పరిగణలోకి తీసుకోవద్దని పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.మరోవైపు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పొందాలంటే ఈ కేవైసీ తప్పక చేయించుకోవాలన్న ప్రచారం జరగడంతో గ్యాస్ ఏజెన్సీలకు వినియోగదారులు పోటెత్తారు. అయితే, ఇప్పటివరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, ఈ కేవైసీ చేసిన వారికే రూ.500 గ్యాస్ సిలిండర్ అనేది అపోహ మాత్రమేనని ఎల్పీజీ డీలర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. కేంద్రం సూచనల మేరకు నవంబర్ నుంచే రాష్ట్రంలో కేవైసీ పరిశీలన జరుగుతోందని స్పష్టం చేసింది. గ్యాస్ సిలిండర్ ఈ కేవైసీకి సంబంధించి ఆఫీసులకు గుంపులుగా వచ్చి ఇబ్బందులు పడొద్దని రాష్ట్ర ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి గతంలో ఓ ప్రకటన విడుదల చేశారు. డెలివరీ బాయ్స్ వద్దే ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని స్పష్టం చేశారు. గ్యాస్ ఈ కేవైసీకి సంబంధించి కేంద్రం ఎలాంటి తుది గడువు నిర్ణయించలేదని, వీలైనంత త్వరగా వినియోగదారుల ఇంటి వద్దకే వెళ్లి కేవైసీ పూర్తి చేయాలని తమకు ఆదేశాలు అందినట్లు చెప్పారు. డెలివరీ బాయ్స్ వద్ద ఉన్న స్మార్ట్ ఫోన్లలో ప్రత్యేక యాప్ ద్వారా కేవైసీ ప్రక్రియ పూర్తి చెయ్యొచ్చని స్పష్టం చేశారు. ఒకవేళ బాయ్స్ వద్ద ఎవరిదైనా పూర్తి కాకపోతే, అలాంటి వారు మాత్రమే ఏజెన్సీ ఆఫీసులకు వెళ్లాలని తెలిపారు.

## మేడారంకు పోటెత్తిన భక్తజనం

సమయంలో లక్షలాది మంది భక్తులతో కిక్కిరిసిపోయి ఉంటుంది. జాతర సమయంలో తోపులాటలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి కుటుంబ సమేతంగా ఆ సమయంలో దర్శనం చేసుకోవడం ఇబ్బందికరంగా ఉంటుందని అందుకే ముందే వచ్చి కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకుంటున్నామని అంటున్నారు. సమ్మక్క సారక్క దేవతలకు ప్రీతికరమైన బెల్లం మొక్కులు సమర్పించడంతో పాటు కోళ్లు, మేకలను మొక్కులు చెల్లించుకుంటున్నారు. అయితే జాతరకు ముందుగానే భక్తుల తాకిడి విపరీతంగా పెరిగిపోవడంతో అధికార యంత్రాంగం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. జాతరకు వచ్చే నాలుగు ప్రధాన రహదారులలో ప్రత్యేకంగా పార్కింగ్కు కూడా ఏర్పాటు చేశారు. స్థానిక మంత్రి సీతక్క కూడా ఈ రోజు మేడారంలో పర్యటించారు. జాతర అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. నార్లాపూర్ నుండి వచ్చే రహదారి మొత్తం పాడైపోవడంతో వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అక్కడి నుంచి నేరుగా చిలకలగుట్ట వైపు వెళ్లిన సీతక్క ఆ మార్గంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించే ప్రసక్తి లేదని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతరను అన్ని శాఖలు సమన్వయంతో సక్సెస్ చేయాలని సూచించారు.

## సమ్మక్క సారలమ్మ వన దేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్క



జయభేరి, ములుగు :

మేడారం సమ్మక్క సారలమ్మ వన దేవతలను పంచాయితీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ దనసరి అనసూయ సీతక్క సోమవారం దర్శించుకున్నారు. ముందుగా పసరలోని గుండ్ల వాగు బ్రిడ్జిని, దయ్యాలవాగు సమీపంలో ఉన్న రోడ్డును చింతల్ క్రాస్ వద్ద రోడ్డు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. అదే విధంగా చిలుకల గుట్ట, వీఐపీ పార్కింగ్ బస్ స్టాండ్ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చెయ్యాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి జాతర పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎస్పీ గౌస్ ఆలం, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎస్పీ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం సోనియా గాంధీ ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లతో సమావేశమయ్యారు. రాష్ట్ర కాబినెట్ ఏక తాటిపైకి వచ్చి ఈ నెల 28న కాంగ్రెస్ ఫౌండేషన్ డే సందర్భంగా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత వి హనుమంతరావు అన్నారు. తెలంగాణాలో గత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. సోనియా గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో ఆరు గ్యారెంటీ స్కీమ్ లను రాష్ట్రంలో అమలుకు శ్రీకారం చూడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్యారెంటీ స్కీమ్ లను ప్రజలకు అందించడంలో ప్రధాన భూమిక పోషించాలి. రాష్ట్రంలో ప్రజలకు పథకాలను అందించడంలో నాయకులు పాల్గొంటే మీ నాయకత్వం కూడా బలపడుతుందని అన్నారు. ఈ నెల 28 నుండి వచ్చే నెల 6 తేదీ వరకు ప్రజలకు అందుబాటులో ఉండి తెల్ల రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ఆరు గ్యారెంటీ స్కీమ్ లను ప్రజలకు అందేలా చూడాలి. నిరక్ష్యరాస్యులైన ప్రజలకు ఆరు గ్యారెంటీ స్కీమ్ లను అందించేలా ప్రతి కార్యకర్త పాటుపడాలి. ప్రజలతో ఉంటే రాజకియంగా అగ్ర స్థానంలో ఉండే అవకాశాన్ని సధ్వినియోగం చేసుకోవాలి. క్రిస్మస్ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి అందించిన క్రిస్మస్ కానుకలను ప్రజలకు అందించడంలో పార్టీ నాయకులు ముందుండాలి. రెజిలింగ్ క్రీడాకారిణి సాక్షి మాలిక్ తీసుకున్న నిర్ణయం చేసిన పోరాటం క్రీడా రంగంలో మహిళల అభ్యున్నతికి దోహదపడుతుందని అభినందించారు.

# 6 హామీలకు దరఖాస్తులు సరే.. కొత్త రేషన్ కార్డులేవి?

- రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నయ్
- ఇంకా లక్షలాది మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు
- వాజ్ పేయి జయంతిని పురస్కరించుకుని ఘన నివాళి అర్పించిన సంజయ్



కరీంనగర్ :

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రధానమైన 6 హామీలను అమలు చేసేందుకు దరఖాస్తులను స్వీకరణకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించడాన్ని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ స్వాగతించారు. అయితే తెల్ల రేషన్ కార్డే అందుకు ప్రధాన అర్హతగా పేర్కొనడం పట్ల సందేహం వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో గత పదేళ్లుగా ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. ఇప్పటికే 10 లక్షల కుటుంబాలు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఇంకా లక్షలాది కుటుంబాలు కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు వేచి చూస్తున్నారు. వాళ్లందరికీ ఏ విధంగా న్యాయం చేస్తారు"అని ప్రశ్నించారు. తక్షణమే కొత్త రేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తులను ఆహ్వానించాలని కోరారు. దీంతోపాటు రాజకీయాలకు అతీతంగా నిజమైన లబ్ధిదారులను గుర్తించి 6 పథకాలను అమలు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి జయంతిని పురస్కరించుకుని జిల్లా పార్టీ కార్యాలయంలో "సుపరిపాలన దినోత్సవం" నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్ పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వాజ్ పేయి దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 2 ఎంపీ సీట్లకే పరిమితమైన బీజేపీని ఆ తరువాత ప్రభుత్వంలోకి తీసుకొచ్చేందుకు అలుపెరగని పోరాటం చేసి మూడుసార్లు ప్రధాని పదవిని చేపట్టి అవినీతి మచ్చలేకుండా నిజాయితీగా, పారదర్శకంగా ప్రజారంజకంగా పాలించిన నేత వాజ్ పేయి. పార్లమెంట్ బలనిరూపణలో ఏఐడీఎంకే అధినేత జయలలిత మద్దతు ఉపసంహరించుకోవడంతో ఒకే ఒక్క ఓటు తక్కువై ప్రభుత్వాన్ని కోల్పోయారు. ఆనాడు ఇతర పార్టీల ఎంపీలు బీజేపీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ..... అంతకుముందు దేశాన్ని నడిపిన పాలకులు ఎంపీలను కొనుగోలు చేసి ఐదేళ్లపాటు ప్రభుత్వాన్ని నడిపి ప్రజాస్వామ్య విలువలకు పాతరేసిన దాఖలాలున్నప్పటికీ.... నేను ప్రజల వద్దకే వెళతానే తప్ప ఇట్లాంటి నీతిమాలిన పనులు చేయబోనంటూ ఏకంగా అత్యున్నత ప్రధానమంత్రి పదవినే వదులుకుని తిరిగి ఎన్నికల్లోకి వెళ్లి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నిజాయితీపరుడు వాజ్ పేయి జీవితం నేటి రాజకీయ నేతలకు, పాలకవర్గాలకు ఆదర్శనీయం. గాంధీజీ కలలు కన్న రామ రాజ్యం... గ్రామ స్వరాజ్య స్థాపన కోసం నిరంతరం పరితపించి అమలు చేసిన మహనీయుడు వాజ్ పేయి. గ్రామీణ సడక్ యోజనతో దేశంలోని అన్ని మారుమూల గ్రామాలకు రోడ్లు వేసిన ఘనత వాజ్ పేయి గారిదే. స్వర్ణ చతుర్భుజీ పేరుతో 4 లేన్లు, 6 లేన్ల జాతీయ రహదారులను ఏర్పాటు చేసి ప్రజలకు రవాణా మార్గాలను సులభతరం చేసిన దూరదృష్టి కలిగిన నాయకుడు. ఇవే కాదు.. ఎయిర్, రైలు కనెక్టివిటీ విషయంలోనూ వాజ్ పేయి ముందుచూపు అందరికీ ఆదర్శనీయం. నిజం చెప్పాలంటే వాజ్ పేయి గారి నిజమైన వారసుడు మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్రమోదీ. మహనీయులను గుర్తుంచుకోవడమంటే వారి జయంతి, వర్ధంతిలు జరుపుకోవడానికే పరిమితం కాదని నిరూపిస్తున్న ప్రధాని నరేంద్రమోదీగారు. వాజ్ పేయి గారి ఆలోచనలకు అనుగుణంగా ఆయన బాటలో నడుస్తూ నేడు భారత్ ను విశ్వగురుగా తీర్చిదిద్దుతున్న నాయకుడు నరేంద్రమోదీ.

దేశాన్ని అర్ధశతాబ్దానికిపైగా పాలించిన కాంగ్రెస్ నేతల పాలనలో ప్రభుత్వం లబ్దిదారులకు రూపాయి విడుదల చేస్తే అందులో 15 పైసలు మాత్రమే వారికి అందేది. మిగిలిన పైసలన్నీ దళారుల చేతుల్లోకి వెళ్లేవని నాటి ప్రధాని రాజీవ్ గాంధీ గారే ఒప్పుకున్న కఠోర సత్యం. పాలనలో అవినీతికి పూర్తిగా అడ్డుకట్ట వేయాలని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్దిదారులకు అందజేయాలనే మహా సంకల్పంతో జీరో బ్యాలెన్స్ తో కొట్లాది మంది పేదలకు బ్యాంకు అకౌంట్లను తెరిపించిన ప్రజలకు నేరుగా వారి ఖాతాల్లోకే నగదు బదిలీ చేస్తున్న గొప్ప నాయకుడు మోదీ గారు. ఈరోజు గ్యాస్ సబ్సిడీ, కిసాన్ సమ్మాన్ నిధి, పెన్షన్లు సహా అనేక నగదు బదిలీ పథకాలన్నీ దళారుల ప్రమేయం లేకుండా నేరుగా పేదల ఖాతాల్లోకి పడుతున్నాయంటే అది మోదీగారి చలువే. 2 వందల 25 కోట్లకుపైగా కరోనా డోసులతో దేశ ప్రజల ప్రాణాలను కాపాడిన ప్రాణదాత మోదీగారు. అలాంటి వ్యక్తి మళ్లీ ప్రధాని కావడం ఈ దేశానికి అవసరం... అందుకే రాబోయే ఎన్నికల్లో బీజేపీకి భారీ మెజారిటీ అందించి ముచ్చటగా మూడోసారి మోదీని ప్రధానిని చేద్దాం... ఈ దేశ ప్రగతిలో భాగస్వాములం అవుదాం... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 6 గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అందుకోసం దరఖాస్తులను ఆహ్వానించడాన్ని బీజేపీ పక్షాన స్వాగతిస్తున్నాం. ఎన్నికలు రాబోతున్నాయి. అంతలోపే లబ్దిదారులను గుర్తించాలి. ఎన్నికల సాకుతో బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా దరఖాస్తులకే పరిమితం కావొద్దని కోరుతున్న. బీఆర్ఎస్ పార్టీ గతంలో నమ్మించి మోసం చేసింది. హామీలిచ్చి చేతులు దులుపుకోవడంవల్లే ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారు. ఆ తప్పు కాంగ్రెస్ చేయొద్దని కోరుతున్నా. నిజమైన లబ్దిదారులను గుర్తించే విషయంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలను, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని కోరుతున్నా.. అట్లాగే బీజేపీ కార్యకర్తలంతా అర్హులైన వారందరిని గుర్తించి దరఖాస్తు చేయించాలని కోరుతున్నా. అట్లాగే గత 10 ఏళ్లుగా ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. ఇప్పటికే 10 లక్షలకు పైగా కుటుంబాలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నాయి. ఇంకా దరఖాస్తు చేయని వారు లక్షల్లో ఉన్నారు. వారందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంతోపాటు 6 ప్రధాన హామీలకు సంబంధించి లబ్ది చేకూర్చేలా చేయాలని కోరుతున్నా... ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల్లోనే 6 పథకాలను అమలు చేయాలని కోరుతున్నా...కొత్త రేషన్ కార్డులు ఎప్పుడిస్తారో, ఎప్పటిలోగా ఈ ప్రక్రియను పూర్తి చేసి కాంగ్రెస్ 6 పథకాలను అందిస్తారో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేయాలి. బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ. అసెంబ్లీ ఎన్నికల్లోనే ఆ పార్టీని తిరస్కరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ పోటీదారు కానేకాదు. ఎంపీ ఎన్నికలంటేనే మోదీ ఎన్నికలనే భావన ప్రజల్లో ఉంది. ఈ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక మెజారిటీ స్థానాలు గెలుచుకోవడం తథ్యం. బీఆర్ఎస్ డిపాజిట్లు గల్లంతు కావడం తథ్యమని అన్నారు.బీఆర్ఎస్ ను ప్రజలు ఓడించినా కేసీఆర్ కొడుకుకు అహంకారం తగ్గలేదు. ఇంకా అధికారంలో ఉన్నట్లుగా భ్రమల్లో ఉంటూ మాట్లాడుతున్నడు.శ్వేత పత్రం... స్వేద పత్రం అంటు అక్షరాలు మార్చి ఒకరికొకరు పత్రాలు రిలీజ్ చేసుకుంటున్నరు.

నేనడుగుతున్నా... 50 లక్షల కోట్ల ఆస్తులు సృష్టిస్తే... తెలంగాణలో 6.75 లక్షల కోట్ల అప్పులు ఎట్లా చేశారు? భూములెందుకు అమ్ముకున్నడు? జీతాలెందుకు ఇవ్వలేపోయిండు? బహుశా కేసీఆర్ కుటుంబమే తెలంగాణను అడ్డుపెట్టుకుని 50 లక్షల కోట్ల ఆస్తులు సంపాదించుకుని విదేశాల్లో పెట్టుబడులు పెట్టుకున్నట్లున్నరు. కేంద్రం ఇచ్చిన నిధులను డైవర్ట్ చేసిందెవరు? వైకుంఠధామాలు సహా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి నిధులన్నీ కేంద్రానివే. జాతీయ రహదారుల నిధులన్నీ కేంద్రానివే. చివరకు పంచాయతీలకు ఇచ్చిన నిధులన్నీ దారి మళ్లించి సర్పంచులకు బిల్లులివ్వకుండా దివాళా తీయించింది మీరు కాదా? బస్తీ దవాఖానాలకు కేంద్రం నిధులిస్తే... బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినట్లుగా గొప్పలు చేసుకుంటూ ప్రజలను మోసం చేసిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదే.. కోవిడ్ టైంలో మోదీ ప్రభుత్వం ప్రజలకు భరోసా ఉచితంగా వ్యాక్సిన్ ఇవ్వడంతోపాటు 80 దేశాలకు పైగా ఉచితంగా వాక్సిన్ ఇచ్చిన ఘనత మోదీదే.. సిగ్గులేకుండా బీఆర్ఎస్ అన్నీ తామే చేసినట్లుగా చెప్పుకుంటే ప్రజలు నవ్వుకుంటున్నరు.

తెలంగాణ ప్రభుత్వం 6 లక్షల 75 కోట్ల రూపాయల అప్పుల్లో మునిగి ఉంది. జీతాలివ్వలేని పరిస్థితుల్లో ఉంది. అయినా 6 గ్యారంటీలంటూ కాంగ్రెస్ హామీలిచ్చింది. అసలు అప్పులను ఎట్లా తీరుస్తారు? 6 గ్యారంటీల అమలుకు నిధులెక్కడి నుండి తీసుకొస్తారు? మీ ప్రణాళిక ఏమిటి? సంపదను ఏ విధంగా సృష్టిస్తారు? అప్పుల ఊబిలో చిక్కుకున్న తెలంగాణను ఎట్లా గట్టెక్కిస్తారో ప్రజలకు వివరించాలి? ఈ విషయంలో ప్రజల్లో అనేక సందేహాలున్నాయి? వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంది. ముస్లిం దేశాలే నిషేధించిన తబ్లిక్ జమాతే సంస్థ సమావేశాలకు ప్రభుత్వం నిధులెట్లా విడుదల చేస్తుంది? దీనివల్ల ముస్లిం పేద సమాజానికి ఏమైనా ఉపయోగం ఉందా? ఉగ్రవాదులను తయారు చేయడంతోపాటు బలవంతపు మతమార్పిళ్లకు పాల్పడే సంస్థ తబ్లిక్ జమాతే సంస్థకు నిధులివ్వడం వెనుక ఉద్దేశమేందో ప్రభుత్వం స్పష్టం చేయాలి.

## ప్రజా దర్బార్ పొమ్మంటే.. తెలంగాణ పార్టీ ఆదుకుంది



- ఇల్లందు అన్నపూర్ణకు అండగా నిలిచిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జయభేరి, ఇల్లందు :

ప్రజల కష్ట సుఖాలు వింటాము, అండగా నిలబడతామంటూ అధికారం అందిన వారం రోజుల పాటు హడావిడి చేసిన ప్రజాదర్బార్ కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితమైనట్లు కనిపిస్తుంది. ఇల్లందు పట్టణం ఆజాద్ నగర్ కి చెందిన అన్నపూర్ణ వందల కిలో మీటర్లు ప్రయాణం చేసి హైదరాబాద్ కి వచ్చింది. పత్రికల్లో, టీవీలలో ప్రజా దర్బార్ ప్రచార ఆర్భాటాన్ని చూసి నాలుగు సార్లు దరఖాస్తు ఇచ్చానని తెలిపింది. దరఖాస్తు తీసుకోవడం మినహా ఇంకా మిగిలిన సమాచారం కానీ స్పందన కానీ ఏ మాత్రం లేదని తెలిపింది. తన ఆర్థిక కష్టాలను, తన పిల్లల చదువుల ఇబ్బందులను, తన దుర్భరమైన జీవితాన్ని వివరించినా... ప్రజా దర్బార్ లో ఊరట దక్కలేదు అన్నది. వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి వచ్చి ప్రజాదర్బార్లో నాలుగు సార్లు దరఖాస్తులు పెట్టుకున్న దయ తలచలేదని, అసెంబ్లీ వద్దకు వెళ్లి సిఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు రోజంతా కాపలా కాస్తే పోలీసులు పొమ్మన్నారని తెలిపింది. అయితే చివరగా తెలంగాణ భవన్ వెళ్లి కేసీఆర్ ను, కేటీఆర్ ను కలిస్తే మీకు కొంత అండ దొరుకుతుందని చెబితే తెలంగాణ భవన్ చేరుకున్నాను. కేటీఆర్ ని కలిసిన వెంటనే ఆయన ఆమె బాధ విని తన వ్యక్తిగత స్థాయిలో లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారని అన్నపూర్ణ సంతోషం వ్యక్తం చేసింది. అధికారంలో ఉన్న లేకున్నా ప్రజల కష్టసుఖాలు వినడానికి... సాధ్యమైనంత వరకు సాయం చేయడానికి ముందుకు వచ్చిన కేటీఆర్ కి అన్నపూర్ణ ధన్యవాదాలు తెలిపారు. అన్నపూర్ణ బాధలు విన్న తర్వాత, ఆమె కూతురు నర్సింగ్ చదువు కోసం లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని కేటీఆర్ అందించారు. బంజారా హిల్స్ లో ఉన్న తన ఇంటికి పిలుచుకొని మరి, చెక్కు అందించారు. తన కూతురు విద్య కోసం, కుటుంబ ఆర్థిక సహాయం కోసం సహకారం అందించిన కేటీఆర్ కి ధన్యవాదాలు తెలిపింది అన్నపూర్ణ.




## రేషన్ కార్డుల కోసం 28 నుంచి మళ్లీ దరఖాస్తులు

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 25

ప్రభుత్వ పథకాలను పొందాలంటే రేషన్ కార్డుల అవసరం ఉండగా.. కొత్త రేషన్ కార్డులు తీసుకోడానికి అవకాశం ఎప్పుడు వస్తుందా అని ప్రజలు ఆశతో ఉన్నారు.తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన నాటి నుంచి ఎదురు చూస్తున్న ప్రజలు కొత్త ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పదేళ్లు.. బీఆర్ఎస్ సర్కార్ ఇదిగో.. అదిగో అంటూ కాలయాపన చేస్తూ వచ్చిన కొత్త రేషన్ కార్డుల జారీకి కాంగ్రెస్ సర్కార్ గ్రీన్సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వం మారితేనే రేషన్ కార్డులు వస్తాయని భావించిన ప్రజల నమ్మకాన్ని నిలబెడుతూ సీఎం రేవంత్రెడ్డి కొత్త రేషన్ కార్డుల జారీకి మార్గదర్శకాలు రూపొందించి ఈనెల 28 నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలను పొందాలంటే రేషన్ కార్డుల అవసరం ఉండగా.. కొత్త రేషన్ కార్డులు తీసుకోడానికి అవకాశం ఎప్పుడు వస్తుందా అని ప్రజలు ఆశతో ఉన్నారు. ఇలాంటి సమయంలో తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే కొత్తరేషన్ కార్డులు ఇవ్వబోతోంది. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్తరేషన్ కార్డులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. తాజాగా ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొత్తం 6,47,297 కొత్త రేషన్ కార్డులు జారీచేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. తెలంగాణలో ఇప్పటి వరకు మొత్తం 2.82 కోట్ల మందికిపైగా రేషన్ లబ్ధిదారులు ఉన్నారు.డిసెంబర్ 28 నుంచి దరఖాస్తులు స్వీకరించాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియపై కసరత్తు చేస్తోంది. అర్హత కలిగిన లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియను క్షేత్రస్థాయిలోనే చేపట్టేందుకు అవసరమైన విధివిధానాలు రూపొందిస్తున్నారు. అర్హుల ఎంపిక ప్రక్రియను గ్రామాల్లో గ్రామసభలు, నగరాలు, పట్టణాల్లో బస్తీసభల ద్వారా చేపట్టాలని భావిస్తున్నట్టు పౌర సరఫరాలశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రక్రియకు ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించనున్నారు. ధ్రువీకరణ పత్రాలతో మీ-సేవ ద్వారా దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూడా ఈనెల 28వ తేదీ నుంచి అవకాశం కల్పించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది.కొత్త కార్డుల జారీకి దరఖాస్తుల ఆహ్వానంతోపాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో సవరణలకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. సవరణలకు సంబంధించి ఇప్పటికే పెద్ద సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి. కార్డుల్లో పిల్లలు, కుటుంబసభ్యుల పేర్లు చేర్చేందుకు 11.02 లక్షల దరఖాస్తులు వచ్చాయి

# మా చుట్టున్న వారితో మేము ప్రేమను పంచు కుంటాము

- వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ అనేది 175 దేశాలలో 8000 చర్చిలలో 5 మిలియన్ల మంది నమోదిత సభ్యులతో ఉన్న ఒక ప్రపంచ సంస్థ.
- డిసెంబర్ 25న ఒకే రోజున 80కి పైగా దేశాల్లో మేము ప్రపంచవ్యాప్త శుభ్రపరిచే క్యాంపెయిన్ నిర్వహించుచున్నాము.

**జయభేరి, కాప్రా :**

వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ ప్రతినిధి పాస్టర్ మధు ద్వారా కాప్రా డివిజన్2 లోని జై జవాన్ కాలనీలో శుభ్రపరిచే కార్యము చేపట్టబడెను. మేము బైబిల్ బోధనల ఆధారంగా పరలోక తండ్రి, పరలోక తల్లిని విశ్వసిస్తాము. "తల్లి యొక్క ప్రేమతో లోకాన్ని రక్షించుట" అనే నినాదంతో మా చుట్టున్న వారితో మేము ప్రేమను పంచు కుంటాము. మేము తల్లి అయిన దేవుడిని విశ్వసిస్తాము మరియు తల్లి ప్రేమను సాధన చేస్తాము. కుటుంబంలో తల్లి చాలా ముఖ్యమైన వ్యక్తి, ఆమె యొక్క గొప్ప త్యాగపూరిత పాత్ర ద్వారా, కుటుంబం ప్రతి పరిస్థితిలో సమతుల్యంగా ఉంటుంది. ఇప్పుడు మనం ఒక భౌగోళిక కుటుంబముగా కలిసి జీవిస్తున్నాం. మన సమాజాన్ని సమతుల్యంగా మార్చ డానికి తల్లి ప్రేమ అవసరమై ఉన్నది కనుక మనము తల్లి యొక్క పాత్రను పోషించవలెను. యేసు క్రీస్తు చేత బోధించబడిన, "పొరుగు వారిని ప్రేమించుడి" అను






నిబంధన అనుసరిస్తూ మేము సమాజంలోని వారితో తల్లి ప్రేమను పంచుకొనుచున్నాము. నేడు.. మానవ జాతి పర్యావరణ భద్రత పరంగా సంక్షోభాన్ని ఎదు ర్కొంటోంది మరియు మా సంస్థ 2007 నుండి వివిధ రకాల పర్యావరణ పరిరక్షణ మరియు సామాజిక సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రేమను పంచుకోవడం ద్వారా సామాజిక అభివృద్ధికి కృషి చేస్తోంది. ప్రపంచ క్లీన్ అప్ క్యాంపెయిన్లు, బ్లడ్ డ్రైవ్, లేక్ క్లీన్ అప్, ట్రీ ప్లాంటేషన్, జీరో వేస్ట్ మేనేజ్మెంట్ మరియు నేరాలను తగ్గించడం వంటివి యువతలో చైతన్యం తీసుకురావ డం వంటివి.. తరతరాలకు స్వచ్ఛమైన గాలి మరియు స్వచ్ఛమైన నీటితో మంచి భవిష్యత్తును సిద్ధం చేయ డానికి మా సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుంది. తల్లి ప్రేమను ప్రపంచమంతటా వ్యాపింపచేస్తూ మరియు సురక్షితమైన మరియు శాంతియుత ప్రపంచాన్ని సృష్టించడం కొరకు మా వంతు ప్రయత్నం చేస్తున్నాము. 25 డిసెంబర్ వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ సభ్యులందరూ జై జవాన్ కాలనీ వాసులతో కలిసి శుభ్రపరిచే ఈ సేవ కార్యక్రమం చేపట్టడం జరిగినది. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కాప్రా డివిజన్2 కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ తిరుమలయ్య, సంస్థ పాస్టర్ మధు, భాస్కర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## సేవా దృకథం తో లాభాపేక్ష లేకుండా వైద్యసేవలు అందించాలి

**జయభేరి, మేడిపల్లి :**

విజయ నెత్రాలయ కంటి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మేయర్ జక్కా వెంకట్ రెడ్డి. సోమవారం ఉప్పల్ డిపో కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయ నేత్రాలయ కంటి ఆస్పత్రిని మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మేయర్ జక్క వెంకట్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రులకు వచ్చే సామాన్య, పేదలకు సేవా దృకథం తో లాభాపేక్ష లేకుండా వైద్యసేవలు అందించాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో అధునాతన వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులతో విజయ నెత్రలయ కంటి ఆస్పత్రిని నెలకొల్పడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఆస్పత్రి నిర్వాహకురాలు డాక్టర్ సుష్మా రెడ్డి డాక్టర్ మేకల మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ.. అధునాతన పరికరాలతో ఉప్పల్ డిపో లో ఎక్కడా లేని విధంగా విజయ నేత్రలయ కంటి ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సరికొత్త పరికరాలతో కంటి పరీక్షలు చేసి అత్యాధునిక పద్ధతుల్లో శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ Rc రెడ్డి, కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, మేడ్చల్ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు వంగేటి ప్రభాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి, మధుకర్ రెడ్డి, చెంద్ర రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల సాయి కిరణ్ రెడ్డి, ఆస్పత్రి డాక్టర్లు సుష్మా రెడ్డి, డాక్టర్ మధుసూధన్ రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయంలో చోరీ

### నగదు.. ఆభరణాలు ఎత్తుకెళ్లిన దుండగులు



**జయభేరి, డిసెంబర్ 25 :**

గుర్తుతెలియని దుండగులు ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ గ్రామంలో చోటుచేసుకుంది. హైదరాబాద్ నుండి కరీంనగర్ కు వెళ్లే రహదారి పక్కన ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలోకి చొరబడిన దుండగులు... ఆలయంలోని సుమారు 5 లక్షల నగదు, 3 తులాల బంగారం, 5 కిలోల వెండి వస్తువులను అపహరించుకొని వెళ్లిపోయారు. ఈ మేరకు ఆలయ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు క్లూస్ టీం ఆధారంగా వివరాలు సేకరించారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వారు పోలీసులు తెలిపారు.

## ఇంటి నిర్మాణ సామగ్రి చోరీ

**జయభేరి, డిసెంబర్ 25 :**

శామీర్ పెట్ లో ఓ ఇంటి నిర్మాణం వద్ద ప్లాస్టిక్, ఇనుప సామగ్రిని గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన సోమవారం శామీర్ పెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. శామీర్ పేట్ సాయి ముక్త ధామం రోడ్డులో మొహ్మద్ షాహిద్ ఇంటి నిర్మాణం (విల్లా) చేసుకుంటున్నాడు. ఇందుకోసం ఇనుప ప్లాస్టిక్ పైపులు నల్లాల తో పాటు ఇతర సామగ్రిని తెచ్చి పెట్టుకున్నాడు. కాగా ఆదివారం ఇంటికి వెళ్లిన షాహిద్ తండ్రి షేకర్ ఇంటి నిర్మాణం వద్దకు వచ్చాడు. అప్పటికే తన సామగ్రి కనిపించ లేదు. వెంటనే తన కొడుకు షాహిద్ తో పాటు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు పరిసర ప్రాంతాలను పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కిస్మస్ కిట్లు పంపిణీ



**జయభేరి, ఘట్ కేసర్ :**

పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ లోని చర్చిలలో క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. సోమవారం నాడు పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ గోస్పాల్ చర్చి, సాయి నగర్ కాలనీలోని గ్లోరి ఫైర్ హీలింగ్ మినిస్ట్రీస్ చర్చిలలో ప్రత్యేక పర్దనలు నిర్వహించి పిల్లలతో కేక్ కట్ చేయించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసినారు. అనంతరం కిస్మస్ కిట్లాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొ ఆప్షన్ సభ్యులు అక్రమ్ ఆలి, గోపు మారెడ్డి, సాగర్ రెడ్డి, పాస్టర్ చిన్న పీటర్, తిలక్ నాయక్, మొక్క ఉపేందర్, శేకర్, పొడుగు నరసింహా, క్రైస్తవ మత పెద్దలు మహిళలు పిల్లాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## క్రీస్తు సందేశం లోకానికి మార్గదర్శం

- నాచారం డివిజన్ మల్లాపూర్ డివిజన్ లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ నియోజకవర్గ క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మానవుడిలో ప్రేమ, క్షమగుణం పెంపొందాలి అనే క్రీస్తు ఆలోచన విధానం నిత్యం ఆచరణనియం అని ఆయన చెప్పారు. ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన యేసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఆయన తెలిపారు. విశ్వ మానవాళికి తన ప్రేమతత్వంతో వెలుగులు నింపిన కరుణమయుడని అన్నారు. శాంతియుత సమాజ స్థాపన కోసం తన రక్తం చిందించిన ధీశాలి యేసుక్రీస్తు ప్రభువు అన్నారు. యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని క్రిస్మస్ పర్వదినాన్ని ఉప్పల్ ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ గొల్లురి అంజయ్య, BRS గ్రేటర్ నాయకుడు సాయి జెన్ శేఖర్, కట్ట బుచ్చయ్య, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

## సోదర సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు

**జయభేరి, ఉప్పల్ :**

ఏసుక్రీస్తు జీవితం క్షమాగుణానికి ప్రతీక ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి. ఉప్పల్ డివిజన్ చర్చి కాలనీలో లూర్దు మాత చర్చి, శ్రీనివాసపురం రామంతపూర్ డివిజన్ హోసన్న పెంటకోస్టల్ చర్చ్ లలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి. అనంతరం ఎమ్మె





ల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఏసుప్రభు బోధనలు శాంతి ప్రేమ సౌభ్రాతృత్యం సహనం ఎప్పటికీ అనుసరణీయమని అన్నారు. ఉప్పల్ నియోజకవర్గం క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సోదరులు ఆనందోత్సాహాలతో సంతోషంగా క్రిస్మస్ జరుపుకోవాలని సూచించారు. క్రీస్తు అనుసరించిన మార్గాన్ని అనుసరించి సమాజ అభివృద్ధి కోసం ప్రజలందరూ పాటుపడాలని రాగిడి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏసుప్రభు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**జయభేరి, ఉప్పల్ :**

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఉప్పల్, చిల్కానగర్ డివిజన్లోని AG, జేసీపీసీ మినిస్ట్రీస్ చర్చలలో చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని కేక్ కట్ చేసి క్రిస్టియన్స్ సోదరీ సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీ క్రిస్టియన్ సోదరులకు పెద్ద పీఠం వేసిందని, ప్రతి క్రిస్మస్ కి పేద క్రిస్టియన్ సోదరీ సోదరీమణులకు క్రిస్మస్ గిఫ్ట్ లు అందజేయడం జరిగిందని, ఆ ప్రభు ఆశీస్సులు ఎల్లప్పుడూ తెలంగాణ రాష్ట్ర ప్రజలపై కేసీఆర్ పై, చిల్కానగర్ డివిజన్ ప్రజలపై ఉండాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు GK బాబు, పాస్టర్ ప్రభాకర్, ఆనంద్ పాస్టర్ బి ర్ స్ పార్టీ సీనియర్ నాయకులు, రత్నం, ఎద్దుల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, రామానుజన్, రవీందర్ గౌడ్, మొదలగువారు పాల్గొన్నారు.





## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**జయభేరి, డిసెంబర్ 25 :**

మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ లోని జీసెస్ ఆర్మీ మినిస్ట్రీస్ చర్చ్ లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఫాస్టర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరగగా క్రిస్టియన్ సోదరులు కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఏసుప్రభును ఆరాధించారు. అంతకుముందు చిన్నారులు ఏసు క్రీస్తు జీవితంపై నృత్య రూపకంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం క్విజ్, పాటల పోటీలు, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు జీవితం గురించి ఫాస్టర్ ప్రభుదాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ నవీన్ డానియల్, ఝాన్సీ ప్రభుదాస్, బ్రదర్ జాన్, బ్రదర్ సత్యం, బ్రదర్ సత్యపాల్, బ్రదర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఆ జిల్లాలో 'కరోనా' టెన్షన్..

- ఒకే కుటుంబంలో ఐదుగురికి పాజిటివ్..!

**జయభేరి, భూపాలపల్లి :**

తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కరోనా కలకలం రేపుతోంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. మొదట పాజిటివ్ వచ్చిన మహిళ ఎంజీఎం ఆస్పత్రిలో కోవిడ్ వార్డులో చికిత్స పొందుతుంటే.. ఆమెతో ప్రైమరీ కాంటాక్ట్లో ఉన్నవారికి కూడా కరోనా పాజిటివ్ రావడంతో హోమ్ ఐసోలేషన్ ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఘనపురం మండలం గాంధీనగర్కు చెందిన ఆగమ్మ అనే 60 ఏళ్ల మహిళకు నాలుగు రోజుల క్రితం కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. ఆమెకు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆ మహిళ కుటుంబ సభ్యుల నుంచి శాంపిల్స్ సేకరించి KMCలోని ల్యాబ్కు పంపారు. ఆ మహిళ కుటుంబ సభ్యులు నలుగురికి కూడా పాజిటివ్ అని తేలింది. దీంతో వారిని హోమ్ ఐసోలేషన్లోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఇలా ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి కరోనా పాజిటివ్ రావడంతో ఊరంతా భయాందోళన చెందుతున్నారు. వారితో ప్రైమరీ కాంటాక్ట్లో ఉన్న వారిలో కొత్త టెన్షన్ పట్టుకుంది. అయితే ఎలాంటి ప్రమాదం లేదని.. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య సిబ్బంది భరోసా కల్పిస్తున్నారు.




పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వెస్ట్ కమలనగర్ కాలనీ ప్రెసిడెంట్ నాగమణి చిందం పాండు నివాసంలో ఘనంగా నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, నాయకులు తూముకుంట్ల శ్రీధర్ రెడ్డి పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేసి వారి కుటుంబ సభ్యులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్క దేవేందర్ రెడ్డి, ఏనుగు మనోరంజన్ రెడ్డి, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, ఉప్పల్**

jayabheridaily.com
ప్రభాత
జయభేరి

# బలగం సినిమా తరహా..

◆ ఆర్మూర్ లో రియల్ స్టోరీ

జయభేరి, నిజామాబాద్, డిసెంబర్ 25

వివాహా కార్యాల్లో చిన్న చిన్న విషయాలకే వధువు, వరుడు బంధువులు తగువులా డుతుంటారు. ఎవరికి వారే తాము గొప్పంటే తామే గొప్పంటూ వాదించుకుంటూ ఉంటారు. చిన్న గొడవలు కాస్తా పెద్దవై...తిట్టుకోవడం, కొట్టుకోవడం అనేక పెళ్లిళ్లలో చూస్తుంటాం. ఆ తర్వాత పెద్దలు వచ్చి సర్దిచెబితే, రెండు వర్గాలు కాంప్రమైజ్ అయిపో తుంటాయి. మరికొన్ని సందర్భాల్లో మాత్రం ఎవరు వెనక్కి తగ్గకపోవడంతో వివాహాలే రద్దు అయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అలాంటిదే నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. నిజామాబాద్ జిల్లాకు చెందిన అమ్మాయితో జగిత్యాల జిల్లా మెట్పల్లి అబ్బాయికి వివాహం కుదిరింది. కట్నకానుకలు మాట్లాడుకున్నారు. పెళ్లి కి ము హూర్తాలు పెట్టుకోవాలని ఇరు కుటుంబసభ్యులు నిర్ణయించారు. అమ్మాయి ఇంట్లో ఎంగేజ్ మెంట్ కార్యక్రమం పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఇంట్లో మాంసాహారం భోజనాలు వడ్డించారు. అక్కడే లొల్లి షురూ అయింది. అబ్బాయి బంధువులు మూలుగ బొక్క కావాలని అడిగారు. వడ్డించే వారు ఆ బొక్క వేయకపోవడంతో గొడవ పెద్దదై పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. అటు అబ్బాయి, ఇటు అమ్మాయి బంధువులు పంతానికి వెళ్లడంతో చివరికి పెళ్లే క్యాన్సిల్ అయింది.గతంలో ఒడిషాలో సంబ ల్పూర్ జిల్లాలోని ధామాలో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. మటన్ కోసం గొడవ పడటంతో పెళ్లికూతురు వివాహాన్ని రద్దు చేసింది. వరుడి, అతని స్నేహితులు మటన్ కోసం దురుసుగా ప్రవర్తించడంతో అమ్మాయి షాకిచ్చింది. ఒడిశా సంబల్పూర్ జిల్లా లోని ధామా ప్రాంతంలో జరిగింది. పెళ్లి అయిపోయిన తర్వాత వరుడి స్నేహితులు ఆరుగు భోజనాలకు వచ్చారు. వారు వచ్చే సమయానికే మటన్ అయిపోయింది. దీంతో వారు పెళ్లికూతురు కుటుంబంతో వాగ్వాదానికి దిగారు. మటన్ కూర వడ్డిం చాల్సిందేనంటూ వధువు తండ్రిని నానా మాటలతో అవమానించారు. దీనికి వరుడు కూడా అతని స్నేహితులకే వంత పాడడటంతో, ఆగ్రహించిన వధులు పెళ్లిని రద్దు చేసింది. అంగరంగవైభవంగా పెళ్లి కార్యక్రమాలు జరుగుతుంటాయి. రుచికరమైన వంటకాలు వడ్డిస్తారు. పెళ్లికి వచ్చినవారికి లేదనకుండా భోజనాలు పెడతారు. చిన్న విషయాలకు తగువు పడి పెళ్లి రద్దు చేసుకోవడం ఈ మధ్య పెరిగిపోయాయి.

# ఆర్టీసీ కార్గో లో ఫోన్లు మాయం

జయభేరి, మహబూబ్ నగర్, డిసెంబర్ 25

ఆర్టీసీ కార్గో పార్సిల్ లో పంపిన ఫోన్లు మాయం మహబూబ్ నగర్ జిల్లాలో కలకలం సృష్టిస్తోంది. గడచిన కొన్ని నెలలుగా ఫోన్లు పంపేందుకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని మొబైల్ ఫోన్ డీలర్స్ అసోషియేషన్ ఆర్టీసి కార్గో సర్వీసును ఉపయోగిం చుకుంటున్నారు. ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా ఇక్కడి నుంచే వివిధ గ్రామాలకు, పట్టణాలకు సెల్ ఫోన్ల సేల్స్ నిర్వహిస్తున్నారు. అయితే మిగిలిన కొరియర్ సర్వీస్ లతో పోల్చితే ఆర్టీసి కనెక్టివిటీ బాగుంటుందని భావించారు. ఏ గ్రామం, పట్టణానికైన సులువుగా, వేగంగా ఫోన్లు పంపించవచ్చని గడచిన కొన్ని నెలలుగా ఆర్టీసి కార్గో సర్వీస్ మీద ఆధారపడ్డారు. అవసరం మేరకు వివిధ గ్రామాల్లోని మొబైల్ ఫోన్ల షాప్ లకు ఆర్డర్ మేరకు సరఫరా చేస్తున్నారు.అయితే ఎనిమిది నెలల క్రితమే మొబైల్ ఫోన్ల పార్సిల్ ఒకటి గమ్యానికి చేరలేదు. కొద్ది రోజులు వేచిచూసి ఆర్టీసి కార్గో సర్వీస్ నిర్వా హకులను ఆశ్రయించారు. వారి నుంచి నిర్లక్ష్యపు సమాధానం వచ్చిందని డీలర్లు తెలిపారు. దీంతో ఆర్టీసి పై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ చేసి పార్శిల్ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎలాంటి స్పందన లేకపోవ డంతో పోలీసులను సైతం ఆశ్రయించారు. పోలీస్ స్టేషన్లో అధికారుల హామీతో వెనక్కి తగ్గారు. కానీ ఇప్పటివరకు ఆ పార్శిల్ అడ్రస్ లేదని వాపోతున్నారు. అప్పటి నుంచి తరచూ పార్శిల్ లు గమ్యానికి చేరడం లేదని మహబూబ్ నగర్ మొబైల్ ఫోన్ డీలర్స్ అసోషియేషన్ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అధీనంలో ఆర్టీసి కార్గో సర్వీస్ ను ఆశ్రయిస్తే ఇలాంటి పరిణామాలు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ఇటీవలే మూడు, నాలుగు పార్శిల్ లు గమ్యం చేరలేదని ఎక్కడున్నాయో ఎవరు చెప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నరు. ఆర్టీసి పై అధికారులను ఆశ్రయిస్తే చర్యలు తీసుకుంటా మని చెబుతున్న ముందడుగు పడడం లేదని చెబుతున్నారు. దీంతో మళ్లీ పోలీసులను ఆశ్రయించినట్లు వెల్లడించారు.తాము పంపుతున్న ఫోన్ల పార్శిల్ ల పై మొబైల్ పరిక రాలు అని పేర్కొంటున్నారని... వాటి వల్ల తాము నష్టపోతున్నామని మొబైల్ ఫోన్ డీలర్స్ అసోషియేషన్ ప్రతినిధులు చెబుతున్నారు. ఫోన్ల విలువ వేల రూపాయిలు ఉంటే కార్గో సర్వీస్ పార్శిల్ పై వందల రూపాయల విలువ ఉంటుందని పేర్కొం టున్నారు. తాజాగా పంపిన పార్శిల్ లు మిస్ అయ్యాయని చెబితే పార్శిల్ విలువ ఆధారంగా డబ్బులు చెల్లిస్తామని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

# అధికారులపై ఒత్తిడి వుండదు

జయభేరి, సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజాపాలనపై అవగాహన కార్యక్రమం లో మంత్రి దామోదర్ రాజనరసింహ పాల్గోన్నారు. మంత్రి మాట్లాడుతూ వ్యవస్థ లో తప్పులు జరిగాయి..వాటిని సరిదిద్దుదాం. కొత్త ప్రభుత్వం ,కొత్త ఆశలు, కొత్త నడవడికలో బాధ్యతగా పనిచేస్తుంది. ఎవరిని విమర్శించే వ్యక్తిత్వం నాది కాదు. ప్రజలు అసహనానికి గురి కాకుండ చూసుకునే బాధ్యత అధికారులదే. అధికారులు, నాయకులు పరస్పర సహకారంతో ముందుకు సాగి లబ్ధిదారులకు ప్రయోజనాల ను అందిద్దాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులపై ఒత్తిడి వుండదు, మానవతా కోణం వుంటుంది. అధికారులు నిబద్ధతతో పని చేయండి ప్రభుత్వ సహకారం మీకు ఎప్పుడు వుంటుందని అన్నారు.

# పాలకులం కాదు..సేవకులం

జయభేరి, మునుగోడు:

మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సోమవారం నాడు మునుగోడు మండల కేంద్రంలోని కమ్మగూడెం జీసస్ చర్చి లో నిర్వహించిన క్రిస్ట మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు, క్రైస్తవ మతస్తులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. కోమటిరెడ్డి మాట్లాడుతూ నేను శాసనస భ్యునిగాను మీ కుటుంబ సభ్యున్ని. మీకు ఏ సమస్య వచ్చినా 24 గంటలు నా ఇంటి తలుపులు తీసే ఉంటాయి. మేము పాలకులం కాదు సేవకులం ఇది మా ప్రభుత్వ నినాదమని అన్నారు.

# సింగరేణి కార్మికుల సొంత ఇంటి కలను నెరవేరుస్తాం

జయభేరి, పెద్దపల్లి

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ఆర్జీ 3 పరిధిలోని ALP, ఓసీపీ 1, ఓసీపీ 2 బొగ్గు గనుల్లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్టీయూసీ తరుపున మంత్రి శ్రీధర్ బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ.... ఐఎన్టీయూసీ కార్మిక సంఘాన్ని గెలిపించాలని సింగరేణి కార్మికులను కోరారు. సింగరేణి ప్రైవేటీకరణ అడ్డుకుంటామన్నారు. సింగరేణిలో నూతన అండర్ గ్రౌండ్ బొగ్గుగనులను ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా డిపెండెంట్ కార్మికులకు ఉద్యోగాలు వచ్చే విదంగా కృషి చేస్తామన్నారు. కార్మికుల సంక్షే మానికి కృషి చేస్తామని, వారి సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదువుకొని డిపెండెంట్ ద్వారా సింగరేణి సంస్థలో ఉద్యోగాలు చేస్తున్నవారికి ఒక్క సంవ త్సరంలోపే ఇంటర్నల్ పరీక్షలు నిర్వహించి వారి అర్హతకు తగిన పనులను కల్పిస్తామని తెలిపారు. మహిళా కార్మికులకు ఇబ్బందులు లేకుండా సింగరేణి సంస్థలో పని చేసుకునే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. చాలా సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిస్కారానికి హైపవర్ కమిటీ నియమించి వారి సమస్యల పరిస్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికుల తల్లిదండ్రులకు రేషన్ కార్డు తో పాటు, పెన్షన్ కల్పిస్తామని పేర్కొన్నారు.

# ఎంపీ సీటు కోసం పోటాపోటీ

జయభేరి, అదిలాబాద్, డిసెంబర్ 25

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం.. హ్యాట్రిక్ కోసం చూస్తున్న కారు పార్టీకి కలిసి వస్తుందా? పార్లమెం ట్ పరిధిలో అన్ని స్థానాల్లో అప్రతిహత విజయాన్ని సాధించిన హస్తం పార్టీ హవా కొనసాగుతుందా? పార్టీల గెలుపు అభ్యర్థుల ఎంపికను బట్టి ఉంటుందా? క్షేత్ర స్థాయి బలాల్లో మార్పులు ఏమైనా జరుగుతాయా? అనే ప్రశ్నలపై పార్లమెంట్ పరిధిలో జోరుగా చర్చ సాగుతోంది. ఇంతకీ ఇక్కడ బరిలో దిగే అభ్యర్థులెవరు? ఈసారి సిట్టింగ్ అభ్యర్థి మారుతాడా? రాజకీయ పార్టీలు చేస్తున్నా వ్యూహాలేంటి?అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో అందరి దృష్టి పార్లమెంట్ ఎలక్షన్స్పై పడింది. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ నియోజ కవర్గంలో రాజకీయంగా, భౌగోళికంగా వైవిధ్యత కలిగి ఉంది. ఓ వైపు సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్సీఎల్ లాంటి పరిశ్రమలు, మరోవైపు వ్యవసాయం ఆధారంగా ఉన్న ఈ నియోజకవర్గంలో రాజకీయంగా ప్రస్తుతం కీలక మార్పులే వచ్చాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీదే హవా కొనసా గింది. ఒక మంథని మినహా అన్ని అసెంబ్లీ స్థానాల్లో కారు పార్టీ ఎమ్మెల్యేలే ఉండేవారు.. దీంతో రెండు సార్లు జరిగిన లోక్సభ ఎన్నికల్లోనూ బిఆర్ఎస్ అభ్యర్థులు సునాయా సంగా విజయం సాధించారు.

కానీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత సీన్ కంప్లీట్ గా చేంజ్ అయింది. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో అన్ని స్థానాలను హస్తం పార్టీ హస్తగతం చేసుకుని క్లీన్స్వీప్ చేసింది. అయితే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాగైనా ఎంపీ సీట్ గెలవాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తుండగా... అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన రిజల్ట్స్న రిపీట్ చేయాలని అధికార కాంగ్రెస్ భావిస్తోంది. ఇక బిజెపి ఈసారి విన్నర్ గా నిలవాలని బలమైన అభ్యర్థిని బరిలోకి నిలపాలని చూస్తుంది. పెద్దపల్లి ఎస్సీ రిజర్వుడు స్థానం కాగా... ఆశావాహులు టిక్కెట్ కోసం ప్రయత్నా లు మొదలు పెట్టారు. గత ఎన్నికల్లో బోర్లకుంట వెంకటేష్ నేత ఎంపిగా విజయం సాధించగా... ఈసారి బిఆర్ఎస్ నుంచి ఆయనే బరిలోకి దిగుతారా? మరోకరికి ఛాన్స్




ఇస్తారా అనే చర్చ సాగుతుంది. బిఆర్ఎస్ తరుపున ధర్మపురి మాజి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్,చెన్నూర్ మాజి ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్లు ప్రధానంగా చర్చకు వస్తున్నాయి. ఇద్దరు కోల్ బెల్ట్ ప్రాంతంతో సంబంధా లున్న కావడంతో... ఇద్దరిలో ఎవరికి అదిష్టానం ఛాన్స్ ఇస్తుందనేది ఆసక్తిగా మారింది. మరోవైపు ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా ఉన్న బోర్లకుంట వెంకటేష్ నేత కూడా మరోసారి బరిలో ఉంటానని ధీమాగా ఉన్నారట. పెద్దప ల్లి పార్లమెంట్ పరిధిలో పార్టీకి ప్రస్తుతం ఉన్న ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో బలమైన అభ్యర్థి అయితేనే విజయం సాధించగలమని భావిస్తున్నారట కారు పార్టీ పెద్దలు. అందులో భాగంగానే ధర్మపురితో పాటు రామగుండం, ఇతర సింగరేణి ప్రాంతాల్లో ప్రభావం చూపగలిగే నేత అయిన కొప్పుల ఈశ్వర్ తాను బరిలో ఉండేందుకు సంకేతాలను పంపారట. మరోవైపు చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కూడా తన ప్రయ త్నాలను ప్రారంభించారట. ఇద్దరు నేతలు కూడా మాల సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో ఇక్కడ గణ నీయమైన సంఖ్యలో ఉన్న నేతకాని సామాజిక వర్గానికి చెందిన తనకు మరోసారి టికెట్ వస్తుందని అంచనాల్లో ఉన్నరట సిట్టింగ్ ఎంపీ వెంకటేష్ నేత.అధికార కాంగ్రెస్ పార్టీలోను ఆశావాహుల సంఖ్య పెరిగిందట. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తన వారసుడిగా వంశీక్రి ష్ణను బరిలో నిలపాలని చూస్తున్నారట.

గతంలో వివేక్ తో పాటుగా ఆయన తండ్రి వెంకటస్వామి పెద్దపల్లి ఎంపిగా రాణించారు. అయితే వారి వారసుడిగా వంశీక్రిష్ణను తీసుకురావాలనేది వివేక్ కుటుంబ సభ్యుల ఆలోచనగా తెలుస్తుంది. ఇక చెన్నూర్ ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడిన మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలుకు ఎంపీ టికెట్ ఇస్తారన అప్పట్లో ప్రచారం సాగింది. ఆయన కూడా వివేక్ గెలుపు కోసం కృషిచేసారు. తాజాగా వంశీ పేరు ప్రచారం అవుతుండటం ఆసక్తిగా మారింది. ఇప్ప టికే ఆ కుటుంబం నుంచి ఇదే పార్లమెంట్ పరిధిలో అన్న దమ్ములైన వివేక్, వినోద్ లు ఎమ్మెల్యేలుగా ఉన్నారు.ఎంపీ టికెట్ కూడా ఆ ఫ్యామిలీకి ఇస్తారా? మరోకరికి ఛాన్స్ ఇస్తారా అనేది వేచి చూడాలి.ఇక బీజేపీ సైతం అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతుంది. ఒక్కసారైన పార్ల మెంట్ సెగ్మెంట్ పై కాషాయం జెండా ఎగరవేయాలనేది ఆ పార్టీ నేతల టార్గెట్ గా తెలుస్తుంది. బీజేపీ నుంచి ధర్మ పురి నుంచి పోటీ చేసిన ఓటమి పాలయిన ఎస్.కుమార్, మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య ఆశావాహుల లిస్టులో ఉన్నారు. వీరిలో పార్టీ సీనియర్ గా ఉన్న కాసీపేట లింగయ్య వైపు అధిష్టానం మొగ్గు చూపుతుందా? సంఘ్ నేతల మద్దతున్న ఎస్.కుమార్ మరోసారి పెద్దపల్లి బరిలో ఉంటారనే ప్రచారం జరుగుతుంది. పెద్దపల్లిలో ఈసారి ఎంపీ సీటు కైవసం చేసుకునేందుకు మూడు పార్టీలు తల పడనున్నాయి. అయితే బలమైన అభ్యర్థులను బరిలో నిలు పేందుకు అభ్యర్థుల బలాబలాలను అంచనా వేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో భిన్నమైన తీర్పునిచ్చిన కార్మికలోకం రాబోయే ఎన్నికల్లో ఎలాంటి తీర్పునిస్తుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

# సంక్రాంతికి ఇంటికి వెళ్లేది ఎలా

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 25

సంక్రాంతి' తెలుగు లోగిళ్లలో పెద్ద పండుగ. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో భాగంగా అధిక శాతం పల్లెల నుంచి పట్టణాలకు వచ్చి స్థిరపడ్డా రు. ఏపీలోని ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి ఇక్కడ స్థిరపడ్డ వారి సంఖ్యే ఎక్కువ. అలాంటి వారు ఏడాదికోసారి కుటుంబంతో కలిసి సంతోషంగా పండుగ జరుపుకోవాలని, సొంతూళ్లకు పయ నమవుతారు. అయితే, ప్రస్తుతం రైళ్లన్నీ ఫుల్ కావడంతో ప్రయాణం ఎలా అనేది అందరిలో నూ ఆందోళన కలిగిస్తోంది. సంక్రాంతికి 3 నెలల ముందు నుంచే ప్రధాన రైళ్లల్లో రిజర్వేషన్లన్నీ పూర్తయ్యాయి. ముఖ్యంగా సికింద్రాబాద్ నుంచి ఉత్తరాంధ్ర ప్రాంతాలకు అంటే శ్రీకాకుళం, విజ యనగరం , విశాఖ వెళ్లే రైళ్లు విశాఖ ఎక్స్ ప్రెస్, ఫలక్ నుమా, వందే భారత్, గోదావరి సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్, గరీభ్ రథ్, ఈస్ట్ కోస్ట్, దురంతో వంటి రైళ్లల్లో రిజర్వేషన్లన్నీ ఫుల్ అయ్యాయి. దాదాపు అన్నీ రిగ్రెట్ అని చూపిస్తున్నాయి. దీంతో ఈసారి పండుగను సొంతూరిలో చేసుకోవాలనేది కలగానే మిగిలిపోతుందేమోనని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ, ప్రైవేట్ బస్సులను ఆశ్రయిద్దామన్నా, అన్నీ ట్రావెల్స్ బస్సుల్లోనూ టికెట్ ఛార్జీలు పెంచేసి చూపిస్తున్నా రని వాపోతున్నారు. సంక్రాంతికి ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ఇటీవల 20 ప్రత్యేక రైళ్లు వేసినా విశాఖ వైపు ఒకటీ లేదని పేర్కొంటు న్నారు. ఇప్పటికైనా, రద్దీ దృష్ట్యా ఉత్తరాంధ్ర వైపు సంక్రాంతికి రైళ్లు వేయాలని రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. లేకుంటే, ఉన్న రైళ్లకు అదనపు బోగీలైనా జత చేసి రిజర్వేషన్లు అందుబాటులోకి వచ్చేలా చేయాలని కోరుతున్నారు. మరోవైపు, సంక్రాంతి రద్దీ దృష్ట్యా ద.మ రైల్వే కొన్ని మార్గా ల్లో 20 ప్రత్యేక రైళ్లను కేటాయించింది. ఈ రైళ్లను హైదరాబాద్ తిరుపతి, కాచిగూడ కాకినాడ టౌన్




రూట్లలో నడపనున్నారు. సికింద్రాబాద్ నుంచి రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు వెళ్లే వారికి ఇవి అనుకూలంగా ఉండనున్నాయి. ఈ నెల 28 నుంచి జనవరి 26 వరకూ ఈ రైళ్లు అందుబాటులో ఉండనున్నాయి.

ప్రత్యేక రైళ్లలో ఫస్ట్, సెకండ్, థర్డ్ ఏసీ బోగీలతో పాటు స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయి. కాచిగూడ కాకినాడ టౌన్ (రైలు నెం 07653) ఈ నెల 28న (గురువారం) రాత్రి 8:30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటుంది. ఈ రైలు డిసెంబర్ 28, జనవరి 4, 11, 18, 25 తేదీల్లో నడుస్తుంది. కాకినాడ టౌన్ కాచిగూడ (రైలు నెం 07654) ఈ నెల 29న (శుక్రవారం) సాయంత్రం 5:10 గంటలకు బయల్దేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4:50 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. ఈ రైలు డిసెంబర్ 29, జనవరి 5, 12, 19, 26 తేదీల్లో ప్రయాణిస్తుంది. హైదరా బాద్ తిరుపతి (రైలు నెం 07509) గురువారం రాత్రి 7:25 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8:20 గంటలకు గమ్యస్థానానికి చేరు కుంటుంది. ఈ రైలు డిసెంబర్ 29, జనవరి 4, 11, 18, 25 తేదీల్లో అందుబాటులో ఉండనుంది. తిరుపతి హైదరాబాద్ రైలు (07510) శుక్రవా రం రాత్రి 8:15 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8:40 గంటలకు గమ్యస్థానానికి చేరుకుంటుంది. ఈ రైలు డిసెంబర్ 29, జనవరి 5, 12, 19, 26 తేదీల్లో రాకపోకలు సాగిస్తుంది. కాచిగూడ కాకినాడ టౌన్ కాచిగూడ ప్రత్యేక రైళ్లు (రైలు నెం. 07653/07654) మల్కాజిగిరి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూ డెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట రైల్వే స్టేషన్ల మీదుగా రాకపోకలు కొనసాగించనున్నా యి. హైదరాబాద్ తిరుపతి హైదరాబాద్ ప్రత్యేక రైళ్లు (రైలు నెం. 07509/07510) సికింద్రాబా ద్, నల్గొండ, మిర్యాలగూడ. నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

# నూతన అండర్ గ్రౌండ్ బొగ్గు గనులను ఏర్పాటు

◆ ఐ ఎన్ టి యు సి ని ఆదరించండి...

◆ కార్మికుల సమస్యలు పరిష్కరించుకోండి...

జయభేరి, కమాన్ పూర్ :

సింగరేణి కార్మికుల సొంతింటి కలను నిజం చేసుకోవాలని ఈనెల 27 న జరిగే సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘమైన ఐఎన్టీయూసీని గెలిపించుకోవాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.

ప్రచారంలో భాగంగా రామగుండం రీజియన్ సోమవారం ఆర్జీ 3 డివిజన్ లోని ఎఎల్పీ, ఓసీపీ 2, ఓసీపీ 1, గనుల పై ప్రచారంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సింగరేణి కార్మికులను ఉద్దేశించి మా ట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కా ర్మికుల సంక్షేమం కోసం కార్మికుల సమస్యల పై పోరాటం చేస్తుందని అన్నారు. సింగరేణి సంస్థ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కాటుపడి ఉందని పెండింగ్ ఉద్యోగా లను ఎటువంటి ఖర్చు లేకుండా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున మంథని నుండి పోటీ చేసిన తనకు ఓటువేసి గెలిపించినందుకు



మంత్రి శ్రీధర్ బాబు సింగరేణి కార్మికులంద రికీ కృతజ్ఞతలు తెలియజేశాడు. సింగరేణిలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ యూనియన్ ఐఎన్టీ యూసీని గెలిపించాలని కోరుతూ మాట్లాడు తూ సింగరేణి కార్మికులకు సొంత ఇంటి కల నిజం చేస్తామని అన్నారు. నూతన అండర్ గ్రౌండ్ బొగ్గు గనులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన కా ర్మికులకు ఒక సంవత్సర కాలంలో ఇంటర్నల్ ఉద్యోగాల నోటిఫికేషన్ వేస్తామని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇన్కంటాక్స్ రద్దు చేస్తామన్నారు. డిపెండెంట్ మహిళ ఉద్యోగులకు చదువుకు తగిన విధంగా ఉద్యోగం ఇస్తామని, కార్మికుల కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. డిపెండెంట్ కార్మికులు డబ్బులు ఖర్చు లేకుండా ఉద్యోగాలు వచ్చే విధంగా కృషి చేస్తామని, కాం ట్రాక్ట్ కార్మికుల సమస్యల పై హైపవర్ కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు అండగా ఉంటుందని మీ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని మంత్రి శ్రీధర్ బాబు సింగరేణి కార్మి కులకు హామీ ఇచ్చారు. సింగరేణి ఎన్నికలలో ఐఎన్టీయూసీని గెలిపించాలని, ఈ నెల 27 తేదీన గడియారం గుర్తుకు ఓటు వేసి భారీ మెజా రిటీతో ఐఎన్టీయూసీ గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో భాగంగా ఐఎన్టీసీ అధ్యక్షుడు జనక్ ప్రసాద్, ఆర్జీ 3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపత యాదవ్, ఐఎన్టీయూసీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు గంట సత్యనారాయణ రెడ్డి కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు ఎంపీపీ ఆ రెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి ఇనగంటి భా స్కరరావు వనం రామచంద్రరావు రొడ్డ బాపన్న ఉయ్యాల కుమారస్వామి మతిన్ ఖాన్ తెలుగు రాళ్ల ఇరుగు రాళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



# వరంగల్ ఎంపీ కోసం నేతల హడావిడి

జయభేరి, వరంగల్, డిసెంబర్ 25

పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీల్లో హడావుడి మొదలైంది. ఆశావాహులు తెగ ఆరాటపడుతున్నారు. కానీ ఆ పార్లమెంట్ స్థానం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అక్కడ ఇప్పటికే ఆశావాహు లు టిక్కెట్ కోసం తెగ ప్రయత్నాలు చేస్తుంటే, ప్రధాన రాజకీయ పార్టీల న్నీ గెలుపు వ్యూహాల్లో నిమగ్నమయ్యాయి.. ఇంతకీ ఆ స్థానం ఏది..? ఆ స్థానంపై ఎందుకంత ఫోకస్ పెరిగింది..? టిక్కెట్ కోసం ఆరాటపడుతు న్న ఆ నేతలు ఎవరు..? అన్నదీ ఆసక్తి రేపుతోంది. పోరాటాల పురిటిగడ్డ వరంగల్ పార్లమెంట్ స్థానం ఇప్పుడు హాట్ ఫేవరెట్గా మారింది. ఎస్సీ రిజర్వ్డ్ కేటాయించిన ఈ స్థానం నుండి పోటీ కోసం పలువురు కీలక నేతలు పోటీ పడుతున్నారు. ఇప్పటికే అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకుని ఒక్క ఛాన్స్ అని వేడుకుంటున్నారు ఆశావాహులు. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నేతల్లో విపరీతమైన పోటీ నెలకొంది. బీఆర్ఎస్ పార్టీ నుండి సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్కు ఈసారి విశ్రాంతి తప్పదనే ప్రచారం జోరు అందుకుంది. ఆయన స్థానంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ను బరిలోకి దింపుతారని ప్రచారం జరుగుతుంది. లేదంటే స్టేషన్ ఘన్పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఆయన కాదంటే కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యను బరిలోకి దింపే అవకాశాలు ఉన్నాయ ని బీఆర్ఎస్ పార్టీలో హాట్ హాట్ చర్చ జరుగుతుంది..ఇక అధికార పార్టీ కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు వరంగల్ పార్లమెంట్ స్థానం ఆసక్తికర చర్చగా మారింది. ఈ నియోజవర్గ ఇంచార్జ్ కొండా సురేఖను పార్టీ అధిష్టానం నిర్ణయించి పావులు కదుపుతోంది. ఈ స్థానం నుండి పోటీకోసం మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య విపరీతంగా ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్ని కల్లో ఇదే పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసి ఓటమిపాలైన దొమ్మటి సాంబయ్య కూడా ఇదే స్థానంపై ఆశలు పెట్టుకున్నారు. ఒక్క ఛాన్స్ ఇవ్వండని పార్టీ అధిష్టానాన్ని వేడుకుంటున్నారు.. ఇంకొక వైపు రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు ఉన్న అద్దంకి దయాకర్ కూడా ఇదే స్థానం నుంచి పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతుంది. మరొక వైద్యుడు, ఒక సీనియర్ దళిత జర్నలిస్టు కూడా ఈ స్థానం నుండి పోటీకోసం కాంగ్రెస్ పార్టీ టికెట్ అభ్యర్థిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది.

ఇదిలావుంటే పొత్తులో బాగంగా కమ్యునిస్టు నేతలు కూడా ఈ స్థానం డిమాండ్ చేసే అవకాశం ఉంది. అయితే వరంగల్ పార్లమెంట్ స్థానంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా అందులో ఆరు అసెంబ్లీ స్థానా ల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు... కేవలం ఒక్క స్టేషన్ ఘన్పూర్ మాత్రమే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఈ స్థానం కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి అత్యంత ప్రతిష్టా త్మకంగా మారిన నేపథ్యంలో ఇక్కడి నుండి బలమైన నేతను బరిలోకి దింపాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం యోచిస్తున్నట్లుగా సమాచారం... ఆ బలమైన దళిత నేత ఎవరూ..? ఎవరికి టిక్కెట్టు దక్కుతుంది అనేదీ ఆసక్తికరంగా మారింది. ఇక భారతీయ జనతా పార్టీ నుండి మంద కృష్ణ మాదిగను బరిలోకి దింపుతారని ప్రచారం జరుగుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షాతో సత్సంబంధాలు ఉన్న మందకృష్ణను వరంగల్ పార్ల మెంటు స్థానం నుండి బరిలోకి దింపితే మాదిగలంతా గంపగుత్తగా బీజేపీ వైపు ఉంటారని ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అన్ని ప్రధాన రాజకీయ పార్టీల్లో ఆశావాహులు ఆరాటపడుతున్నారు. కానీ ధన బలం, ప్రజాబలం కలిగిన నేతలను బరిలోకి దింపేందుకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీల్లో మేధోమథనం జరుగుతున్నట్లు సమాచారం.



# కథ విని ట్రాన్స్‌లో ఉండిపోయాను

'సలార్' వసూళ్లలో దూసుకుపోతున్నది. ఈ వేగం ఎందాకా సాగుతుందో చూడాలి. ప్రభాస్ కెరీర్‌లోని భారీ విజయాల్లో ఒకటిగా 'సలార్'ను చెప్పుకుంటున్నారు. ఇదిలావుంటే ఈ సినిమా గురించి ఓ హాలీవుడ్ మీడియా ఇంటర్వ్యూలో ప్రభాస్ మాట్లాడారు. ' నా కెరీర్‌లో చేసిన విభిన్న పాత్రల్లో 'సలార్' ఒకటి. ప్రశాంత్‌నీల్ కథ చెప్పగానే కాసేపు అదే ట్రాన్స్‌లో ఉండిపోయాను. నిజంగా సవాల్‌తో కూడుకున్న పాత్ర ఇది. అందుకే వెంటనే అంగీకరించాను. 'బాహుబలి' నా కెరీర్‌కు ఒక బెంచ్‌మార్క్‌ను క్రియేట్ చేసింది. ఆ సినిమా తర్వాత కథల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి నాకు నెలకొంది. జనాల మైండ్ సెట్‌లో కూడా మార్పు వచ్చింది. మూస సినిమాలను ఇష్టపడటంలేదు. అందుకే కొత్తగా వెళ్లాలనే మంచి కథలు ఎంచుకుంటున్నాను. ప్రస్తుతం ప్రపంచం భారతీయ సినిమాలవైపు చూస్తున్నది. బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్, మల్లూవుడ్ అని కాకుండా భారతీయ సినిమా పరిశ్రమగా ప్రపంచం మనల్ని గుర్తిస్తున్నది. దీనికి రాజమౌళి, ప్రశాంత్‌నీల్ లాంటి దర్శకులే కారణం. వారితో కలిసి పనిచేయడం నిజంగా గొప్ప అనుభూతి. 'సలార్' పార్ట్2 మరింత అద్భుతంగా ఉంటుంది' అంటూ చెప్పుకొచ్చారు ప్రభాస్.



# రకుల్ ప్రీత్‌కు శాంటా క్లాజ్ ఇచ్చిన బహుమతి ఏంటో తెలుసా?

'శాంటా నాకిచ్చిన బహుమతి నువ్వు. నీ నవ్వు, నీ జాలిగుణం.. నీ మంచితనం, నీ ప్రేమ నాకు వరం. హ్యాపీ బర్త్‌డే బేబీ.. ఇకనుంచి ప్రతి రోజూ నువ్వు కోరుకున్నవన్నీ సమృద్ధిగా నీకు దొరకాలి. హ్యాపీ క్రిస్మస్..' అంటూ పోస్ట్ పెట్టింది రకుల్‌ప్రీత్‌సింగ్. క్రిస్మస్ రోజునే తన ప్రియుడు జాకీ భగ్నానీ పుట్టినరోజు కూడా కావడంతో తన ప్రియబాంధవుడికి తన సోషల్‌మీడియా ద్వారా అక్షరాలతో ప్రేమను కురిపించేసింది రకుల్ ప్రీత్. ఈ సందర్భంగా అభిమానులు అడిగిన ప్రశ్నలకు కూడా ముద్దు ముద్దు సమాధానాలిచ్చేసింది. 'మా ప్రేమకు రెండేళ్లు. క్రిస్మస్‌రోజునే తను పుట్టాడు. ఇదేరోజు సరిగ్గా రెండేళ్ల క్రితం మాలో ప్రేమ చిగురించింది. అందుకే ఇది మాకు స్పెషల్‌డే.' అని చెప్పింది రకుల్. మరి పెళ్లెప్పుడు? అనడిగితే.. 'జీసెస్ ఎప్పుడంటే అప్పుడు..' అంటూ తెలివిగా సమాధానమిచ్చేసింది.



# ముస్తాబవుతున్న గుంటూరు కారం

మహేష్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న 'గుంటూరు కారం' చిత్రం నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. మహేష్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న 'గుంటూరు కారం' చిత్రం నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఇటీవల విడుదల చేసిన పాటలకు అద్భుతమైన స్పందన లభించింది. ప్రస్తుతం ఈ సినిమా తుదిదశ చిత్రీకరణలో ఉంది. హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో నాయకానాయికలపై రొమాంటిక్ గీతాన్ని తెరకెక్కిస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఈ పాట చిత్రీకరణను పూర్తి చేయబోతున్నారు. దీంతో సినిమా షూటింగ్ మొత్తం పూర్తయినట్లేనని చిత్రబృందం తెలిపింది. శ్రీలీల, మీనాక్షి చౌదరి, ప్రకాష్‌రాజ్, బ్రహ్మానందం, జగపతిబాబు, జయరాం తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకురానుంది.

# ఆయనతో పోటీపడి నటించా..

అందంగా ఉండేవాళ్లకు అభినయకౌశలం ఉండాలని లేదు. కానీ.. ప్రియాంకకు రెండూ మెండుగా ఉన్నాయి. అందుకే సదరన్ సినిమాలో దూసుకుపోతున్నది ప్రియాంక. తమిళంలో అయితే చేతినిండా సినిమాలే. తెలుగులో పవన్‌కల్యాణ్ 'ఓజీ'లో ప్రియాంకే కథానాయిక. ప్రస్తుతం తాను తమిళంలో నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. ఈ సినిమాలో తొలిసారి డీ గ్లామరైజ్డ్ కేరక్టర్ చేస్తున్నది ప్రియాంక. ఈ పాత్ర గురించి ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'ఇది పెక్యులర్ సబ్జెక్ట్. ఈ కథలో ఉన్న ప్రతి పాత్రా వైవిధ్యమైనదే. అన్ని పాత్రలూ ఛాలెంజింగ్ రోల్సే. దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ ఎంతో రీసెర్చ్ చేసి తయారు చేసుకున్న కథ ఇది. మూడేళ్ల క్రితమే ఈ కథ రెడీ చేశారాయన. ఓ విధంగా ఆ కథే పాత్రధారులను ఎంపిక చేసుకుంది అనాలి. అందరూ సరిగ్గా సెట్ అయిపోయారు. ముఖ్యంగా ధనుష్‌సార్. ఇందులో ఆయన నట విశ్వరూపాన్ని చూస్తారు. ఆయనతో పోటీపడి నటించే పాత్ర నాది. నా కెరీర్‌లో నిలిచిపోయే పాత్ర అని చెప్పొచ్చు.' అని ఉద్వేగంగా చెప్పుకొచ్చింది ప్రియాంక అరుళ్‌మోహన్.



# రవితేజ మిస్టర్ బచ్చన్ రెగ్యులర్ షూట్ షురూ..?




హరీష్ శంకర్ దర్శకత్వంలో మాస్ మహారాజా రవితేజ హీరోగా మరో సినిమా వస్తుందని తెలిసిందే. 'మిస్టర్ బచ్చన్' టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ మూవీ ఇటీవలే హైదరాబాద్‌లో గ్రాండ్‌గా పూజాకార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ మూవీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ తెరకెక్కిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇప్పటికే లాంచ్ చేసిన టైటిల్ పోస్టర్‌లో రవితేజ తన ఫేవరేట్ లెజెండరీ యాక్టర్ అమితాబ్ పోజ్‌లో కనిపిస్తూ మూవీ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తున్నాడు. కాగా ఇప్పుడీ సినిమా షూటింగ్‌కు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. తాజా టాక్ ప్రకారం మిస్టర్ బచ్చన్ రెగ్యులర్ షూటింగ్ డిసెంబర్ 28 నుంచి హైదరాబాద్‌లో షురూ కానుంది. త్వరలోనే దీనికి సంబంధించిన వివరాలను రవితేజ టీం వెల్లడించనుందని తెలుస్తోంది. మొత్తానికి రవితేజ ఓ వైపు ఈగల్ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్స్ ఇస్తూనే.. మరోవైపు మిస్టర్ బచ్చన్ షూటింగ్‌తో బిజీ కానున్నాడన్నమాట. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నాడు. రవితేజ బిగ్‌బి అమితాబ్‌బచ్చన్‌కు వీరాభిమాని అని తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా సినిమాకు మిస్టర్ బచ్చన్ టైటిల్ పెట్టడంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. 'మిస్టర్ బచ్చన్.. నామ్ తో సునా హోగా' అని రవితేజ చెప్పిన డైలాగ్‌తో ముహూర్తపు సన్నివేశాన్ని చిత్రీకరించారు. రవితేజ ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్ అభిమానిగా కనిపిస్తారని ఇన్‌సైడ్ టాక్. ఈ చిత్రానికి కెమెరా: ఆయనంక బోస్, సంగీతం: మిక్కీ జే మేయర్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, సమర్పణ: పనోరమా స్టూడియోస్, టీసిరీస్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్, రచనదర్శకత్వం: హరీశ్ శంకర్.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com